సాక్షి సిద్దిపేట

శుక్రవారం : 16 : ఫిబ్రవరి : 2024



గౌరవెల్లి నీళ్ల కోసం అసెంబ్లీలో..

గౌరవెల్లి నీళ్ల కోసం శాసన సభా వేదికగా చర్చిస్తే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఎదురుదాడి చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

వివరాలు 8లో ▸



కబ్జా భూమిని..

కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని గ్రామస్తులే అడ్డుకొని ఫ్లెక్సీ బోర్డును ఏర్పాటు చేశారు. ఈ ఘటన కొండపాక మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు 8లో ▸



మైనర్ డ్రైవింగ్ చట్టవిరుద్ధం

ట్రాఫిక్ నిబంధనలు విద్యార్థి దశ నుంచే పాటించాలని, మైనర్లు డ్రైవింగ్ చేయడం చట్టవిరుద్ధమని రూరల్ ఎస్‌ఐ అపూర్వరెడ్డి సూచించారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

దుబ్బాకను రెవెన్యూ డివిజన్ చేయండి

అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



అసెంబ్లీలో మాట్లాడుతున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: దుబ్బాకను రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి గురువారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించారు. రెవెన్యూ డివిజన్ కోసం చాలా ఏళ్లుగా ఈ ప్రాంతంలో ఉద్యమాలు జరుగుతున్నాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సైతం ఎన్నికల ప్రచార సభలో హామీ ఇచ్చారని అన్నారు. ప్రభుత్వం వెంటనే రెవెన్యూ డివిజన్‌పై ప్రకటన చేయాలని కోరారు. అలాగే దుబ్బాక రింగురోడ్డు, హబ్షీపూర్ –దుబ్బాక నాలుగు లేన్ల రోడ్లతో పాటు నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలన్నారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సభ నుంచి సానుకూలంగా స్పందన వచ్చిందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించడంపై డివిజన్ సాధన సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

కళా వేదిక జిల్లా అధ్యక్షుడిగా రాజేశ్



దౌల్తాబాద్(దుబ్బాక): కళా వేదిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా దౌల్తాబాద్ మండలం సూరంపల్లికి చెందిన బొల్లం రాజేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర సంఘం అధ్యక్షుడు నకిరేకంటి కిరణ్‌కుమార్ గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ జిల్లాలో వెనకబడిన కళాకారుల కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. నాపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన నకిరేకంటి కిరణ్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న జనార్దన్

బెజ్జంకి(సిద్దిపేట): భారత రత్న మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు, మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఇంపాక్ట్ ఫౌండేషన్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ సంస్థ ట్రైనర్ జనార్దన్ సూచించారు. బెజ్జంకి మోడల్ స్కూల్, బాలుర, బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు గురువారం స్వేరోస్ సంస్థ జిల్లా అధ్యక్షుడు బాబు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మానసిక, సామాజిక స్పృహ అలవరుచేకోవాలని దిశానిర్దేశం చేసుకోవాలన్నారు. ఒక లక్ష్యం ఎంచుకుని ముందుకు సాగితే విజయం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఇంచార్జి బాలయ్య, నిర్మల, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

జీవితాన్ని మార్చేది విద్యే



విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేస్తున్న మహామిత్ర సభ్యులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మనిషి జీవితాన్ని మార్చేది చదువు ఒక్కటేనని, చదువుకుంటే ఎక్కడైనా బతకవచ్చని మహామిత్ర అసోసియేషన్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పెద్దకోడూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మహామిత్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, బాక్స్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య వికాసాన్ని అందిస్తుందన్నారు. అన్ని దానాల్లో కన్న విద్యా దానం గొప్పదన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరాలన్నారు. మహామిత్ర సభ్యులు విఠల్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం రాజలింగారెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, శోభ, కవిత, అజంతా తదితరులు పాల్గొన్నారు.

పొలాలు నెర్రలు.. రైతుల్లో దిగులు

ఎండుతున్న పంటలు

- విద్యుత్ సరఫరాలో లోఓల్టేజే కారణం
- మంత్రి దృష్టి సారించాలని వేడుకోలు



రామవరంలో నెర్రలు బారిన వరి పొలం

అక్కన్నపేట(హుస్నాబాద్): వరి పొలాలు నెర్రలు బారుతుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. విద్యుత్ సరఫరాలో అంతరాయం.. లోఓల్టేజీ సమస్యతో నీరు అందక పంటలు ఎండుతున్నాయని రైతులు వాపోతున్నారు. నిత్యం లోఓల్టేజీతో వరి, మొక్కజొన్న పంటలు ఎండుముఖం పట్టాయి. అక్కన్నపేట మండలం రామవరంలో దాదాపు 30ఎకరాల్లో పంటలు వాడిపోతున్నాయి. రాత్రి 9 గంటల నుంచి మరుసటి రోజు సాయంత్రం 5:45నిమిషాల వరకు విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ లో ఓల్టేజీతో అన్నదాతలు ఆగమాగం అవుతున్నారు. ఈ గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్నా అందులో కెపాసిటర్ బ్యాంక్ లేకపోవడంతో లోఓల్టేజీ విద్యుత్ సరఫరా అవుతుందని రైతులు చెబుతున్నారు. వారం, పదిరోజుల్లోనే దాదాపు 15స్టార్టర్లు, 6 మోటార్లు కాలిపోయాయన్నారు. సమస్యను పరిష్కరించాలని అనేకసార్లు విద్యుత్‌శాఖ అధికారు దృష్టికి తీసుకెళ్లినా తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కింద ఉన్న బావుల్లో చివరి వరసలో ఉన్న బావులు లోఓల్టేజీ కారణంగా పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ మా రైతుల సమస్యలపై పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



వరి పొలం ఎండిపోయింది

ఎకరం వరి, రెండు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. కానీ లోఓల్టేజీతో వరి పంట పూర్తిగా నెర్రలు బారింది. మొక్కజొన్న పంట కూడా వాలిపోతోంది. బోరు బావిలో పుష్కలంగా నీరు ఉన్నా కరెంట్ సరఫరా లోపం శాపంగా మారింది. ఇప్పటికీ 2 స్టార్టర్లు, ఒక మోటారు కాలిపోయింది. సాగుకు దాదాపు రూ.50వేల వరకు పెట్టుబడి పెట్టాను. పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

– పొన్న కర్ణాకర్, రైతు రామవరం

వహ్వా.. వలంటీర్

- ఎన్‌ఎస్‌ఎస్ సభ్యుల వినూత్న బోధన
- సర్కారు బడుల్లో చిన్నారులకు విద్యాభ్యాసం
- తొలిమెట్టుకు అనుబంధంగా కార్యక్రమం
- ప్రతి శనివారం ప్రత్యేక తరగతులు
- 250 పాఠశాలల్లో.. 585 వలంటీర్లు



విద్యా బోధన చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్

విద్యార్థులు చదువుతూనే.. చిన్నారులకు చదువు చెబుతున్నారు. ఇదేంటి అనుకుంటున్నారా? వింటున్నది నిజమే. విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా పిల్లల కోసం అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. జిల్లాలోని ఆరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు చిన్నారులకు విద్యాబోధిస్తున్నారు. చదువులో రాణించేలా తోడ్పాటునందిస్తున్నారు.

సాక్షి, సిద్దిపేట: కరోనా సమయంలో ప్రభుత్వ పాఠశాలలు సక్రమంగా నడవకపోవడంతో ప్రాథమిక స్థాయిలో సామర్థ్యాలు తగ్గినట్లు విద్యాశాఖ గుర్తించారు. ముఖ్యంగా 5వ తరగతిలోపు చదువుతున్న విద్యార్థులు కనీసం చదవడం, రాయడం, కూడికలు, తీసివేతలు, బాగహారాలు వంటి ప్రాథమిక అభ్యసనాల్లో విద్యార్థులు బాగా వెనకబడినట్లు విద్యాశాఖ గుర్తించింది. విద్యార్థుల్లో కనీస సామర్థ్యతను పెంపొందించాలని ఉద్దేశ్యంతో పిల్లల కోసం అనేక కార్యక్రమాలను చేపట్టారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిద్దిపేట, మహిళ కళాశాల సిద్దిపేట, ప్రభుత్వ డిగ్రీ కళాశాల చేర్యాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల గజ్వేల్, మహిళా డిగ్రీ కళాశాల గజ్వేల్, దుబ్బాకలలో కళాశాలలోని ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను ఎంపిక చేశారు. ఈ ఆరు కళాశాలలో 585 వాలంటీర్ల ద్వారా 250 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి విద్యాబోధన చేయిస్తున్నారు. తొలుత వలంటీర్లకు శిక్షణ ఇచ్చి మాడ్యుల్స్‌ను అందించారు.

అక్క.. అన్నగా కలిసిపోయి..

సీ గ్రేడ్ విద్యార్థులకు ఆట పాటలతో బోధన చేస్తూ.. కనీస స్థాయికి తీసుకురావడానికి వలంటీర్లు కృషి చేస్తున్నారు. ఓ టీచర్‌గా కాకుండా అక్క... అన్న మాదిరిగా ఓ కుటుంబ సభ్యుడిగా కలిసిపోయి విద్యా బోధన చేస్తున్నారు. టీచర్ అంటే కొందరు విద్యార్థుల్లో భయం ఉంటుంది అదే అక్క... అన్న అంటే కలిసిపోతారు. కనుక వారితో ఆడుతూ పాడుతూ చదువు చెబుతున్నారు. భవిష్యత్తులో ఉపాధ్యాయ, అధ్యాపక వృత్తిలో స్థిరపడేందుకు ఇలాంటి అనుభవం ఎంతగానో దోహదపడనుంది.

మ్యాథ్స్, ఇంగ్లిష్ బోధిస్తున్నా..



సిద్దిపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువులో వెనకబడిన విద్యార్థులకు మ్యాథ్స్, ఇంగ్లిష్ బోధిస్తున్నా. టీచర్‌గా కాకుండా సొంత అక్కగా వారితో కలిసిపోయి చదువు చెబుతున్నా. టీచర్లు అంటే ఏ విద్యార్థికైనా కొంత భయం. కుటుంబ సభ్యులు అయితే భయం తక్కువ.

– సీహెచ్. మధుర, సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మొదటి సంవత్సరం

అనుభవం ఏర్పడుతుంది



గజ్వేల్ మండలం బంగ్ల వెంకటపురంలోని ప్రభుత్వ పాఠశాలను కేటాయించారు. చిన్నారులకు చదువు చెబుతుంటే ఎంతో ఓపిక.. అనుభవం ఏర్పడుతోంది. సొంత అన్న మాదిరిగా బోధిస్తున్నా.. చదువుకుంటూనే చదువు చెప్పడం చాలా సంతృప్తిని ఇస్తోంది.

–వీ అన్వేష్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల గజ్వేల్, బీఏ తృతీయ సంవత్సరం

సామర్థ్యాలను పెంచేందుకే..



సీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులను కనీస స్థాయికి తీసుకురావడానికి కమ్యూనిటీ వలంటీర్లు కృషి చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 585 ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను నియమించాం. ప్రతి శనివారం వారికి కేటాయించిన పాఠశాలకు వెళ్లి విద్యా బోధన చేస్తున్నారు. ఇలా బోధించడం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి.

–రంగనాథస్వామి, కమ్యూనిటీ మొబిలైజింగ్ అధికారి



కొమురవెల్లి దేవాలయంలో పట్నం వేసిన మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, లక్ష్మణ్, రఘునందన్ తదితరులు

మల్లన్న చెంత రైల్వేస్టేషన్

- సకల సౌకర్యాలతో ఏర్పాటుకు చర్యలు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి
- కొమురవెల్లిలో భూమిపూజ

కొమురవెల్లి (సిద్దిపేట): భక్తుల సౌకర్యార్థం కొమురవెల్లిలో రైల్వేస్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. గురువారం రైల్వేస్టేషన్ నిర్మాణానికి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కొమురవెల్లి కొండ ప్రాంతం కావడం.. రైల్వేస్టేషన్ ఏర్పాటుకు అనుకూలంగా లేకపోవడంతో అధికారులు నిరాకరించారన్నారు. ప్రధాని మోదీ చొరవతో పనులు జరుగుతున్నాయన్నారు. కొమురవెల్లి మల్లన్నను దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాలనుంచి భక్తులు వస్తారని, వారి సౌకర్యార్థం సకల సౌకర్యాలతో రైల్వేస్టేషన్ నిర్మాణం జరుగుతుందన్నారు. స్టేషన్ ఏర్పాటుకు సహకరించిన రైల్వేశాఖ మంత్రికి ప్రత్యేక ధన్యవాదలు తెలిపారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, జిల్లా పరిషత్ చైర్మన్ రోజాశర్మ, మాజీ ఎంపీ బూరనర్సయ్య గౌడ్ మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, జెడ్పీటీసీ సిద్దప్ప, మల్లన్న ఆలయ చైర్మన్‌లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు పూజలు..

కొమురవెల్లి మల్లికార్జున స్వామికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌లు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పట్నం వేసి మొక్కులు చెల్లించారు. వీరికి ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు.



రైల్వే స్టేషన్ బోర్డు వద్ద కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా వ్యాప్తంగా 44 పరీక్షా కేంద్రాలు
- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి
- అధికారులకు దిశానిర్దేశం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేటరూరల్: ఇంటర్మీడియెట్ పరీక్షలు ఈనెల 28 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణ కమిటీతో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 20,949 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. మొత్తం 44 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద అత్యవసర వైద్య సేవలకు ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షల నిర్వహణ విషయంలో ఎప్పటికప్పుడు తగిన సూచనలు, సలహాల కోసం సమన్వయ కమిటీ సంప్రదింపులు కొనసాగాలని, ప్రతి విషయాన్ని కలెక్టర్‌కు నివేదించాన్నారు. కార్యక్రమంలో ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాధికారి ఆర్.సూర్య ప్రకాశ్, డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, డీఎంహెచ్ఓ జె.కాశీనాథ్, అదనపు డీసీపీ మల్లారెడ్డి, పోస్టల్ అధికారి శ్రీనివాస్, విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ మహేష్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మార్పు అంటే ఇదేనా?



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ విద్యార్థి నాయకులు

సిద్దిపేటజోన్: కాంగ్రెస్ మార్పు అంటే సిద్దిపేటలోని వెటర్నరీ కళాశాలను కొడంగల్‌కు తరలించడమా అని సిద్దిపేట నియోజకవర్గ బీఆర్‌ఎస్ యువత, విద్యార్థి విభాగం నేతలు ప్రశ్నించారు. గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మహేష్, యాదగిరి, రజనీకాంత్, రెడ్డి ప్రభాకర్ రెడ్డిలు మాట్లాడారు. సిద్దిపేట కలలను నిజం చేసే క్రమంలో తెలంగాణ ప్రభుత్వంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు ఒక్కొక్కటిగా విద్యాసంస్థలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వెటర్నరీ కళాశాలను తన సొంత నియోజకవర్గానికి తరలించే ఆలోచనలో సీఎం రేవంత్ రెడ్డి చూస్తున్నారని ఆరోపించారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. వెటర్నరీ కళాశాల తరలిస్తే పెద్ద ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

సిద్దిపేట కీర్తియే స్ఫూర్తి



బాధ్యతలు చేపడుతున్న ప్రసన్న రాణి

- ఖ్యాతిని మరింత ఇనుమడింపజేస్తా
- ప్రతి విభాగంపై ప్రత్యేక దృష్టి
- మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి

సిద్దిపేటజోన్: మున్సిపాలిటీ సాధించిన ఖ్యాతిని మరింత ఇనుమడింప చేసేందుకు కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ కటంగూరి ప్రసన్నరాణి అన్నారు. మహబూబాబాద్ నుంచి బదిలీపై వచ్చిన ఆమె గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధికి సమర్థంగా పనిచేస్తానన్నారు. క్షేత్ర స్థాయిలో అన్ని విభాగాల మీద ప్రత్యేక దృష్టి సారించి, పారదర్శకంగా సేవలు అందేలా చూస్తానని చెప్పారు. స్వచ్ఛ సర్వేక్షన్ లో మెరుగైన ర్యాంకింగ్ సాధనకు కృషి చేస్తానన్నారు. ప్రధానంగా హరితహారం, పారిశుద్ధ్యం, నీటి సరఫరా తదితర వాటిపై ఫోకస్ పెట్టి మెరుగైన ఫలితాల కోసం కృషి చేస్తానన్నారు. ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను తొలగిస్తామని, టౌన్ ప్లానింగ్ విభాగంపై నిరంతరం పర్యవేక్షణ ఉండేలా చూస్తానని అన్నారు. పచ్చదనం బాగుందని, మొక్కల సంరక్షణ, వాటి నిర్వహణ కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. అంతకు ముందు కమిషనర్ ప్రసన్నరాణి కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అదనపు కలెక్టర్ గరీమ అగర్వాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

అక్కన్నపేట (హుస్నాబాద్): పర్యావరణానికి ప్రమాదంగా మారిన ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతిఒక్కరూ నిషేధించాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ పిలుపునిచ్చారు. అక్కన్నపేట మండలం అంతక్కపేటలో ప్రత్యేక పారిశుద్ధ్య గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి కార్యాలయంలో ప్లాస్టిక్‌కు బదులుగా స్టీలు ప్లేట్లు తదితర వాటిని ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ప్రస్తుతం వినియోగిస్తున్న ప్లాస్టిక్‌లో కేవలం 9శాతం మాత్రమే రీసైక్లింగ్ అవుతున్నదని, మిగిలిన ప్లాస్టిక్ వ్యర్థాలు నాలాలు, చెరువులు తదితర వాటిల్లో కలుస్తూ జీవనానికి పెను ముప్పుగా పరిణమిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇంజమూరి సంజీవ్‌కుమార్, ఎంపీడీఓ భానోతు జయరాం, ఎంపీటీసీ సభ్యురాలు కంది రజిత తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ క్రీడాకారుల ఎంపిక

సిద్దిపేటజోన్: ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక స్టేడియంలో క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. ఎంపికైన వారు ఈనెల 17 నుంచి 19 వరకు కరీంనగర్ పట్టణంలో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా క్లబ్ అధ్యక్షుడు సాయిరాం, హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయ్, పిఈటీలు,క్రీడాకారులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులు

క్లుప్తంగా

ఐకేపీ వీఓఏ దారుణ హత్య


బాలరాజ్(ఫైల్)

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన సదాశివపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నిజాంపూర్ గ్రామానికి చెందిన జలగల్ల బాలరాజ్ (40) ఐకేపీ వీఓఏగా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నిజాంపూర్ గ్రామ శివారులోని మనోరంజన్ రెడ్డికి చెందిన షెడ్డు వద్ద గురువారం బాలరాజ్ మృతదేహాన్ని స్థానికులు గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెళ్లి పరిశీలించారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పథకం ప్రకారం జలగల్ల బాలరాజ్‌ను హత్య చేశారని. మృతుడి గొంతు చుట్టూ బట్ట, తాడు బిగించి చంపేసి షెడ్డులో పడుకోబెట్టారని పోలీసులు తెలిపారు. హత్య చేసిన ఆనవాళ్లు తెలియకుండా మృతదేహం చుట్టూ కారంపొడి చల్లారని, డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్‌లను రప్పించి వివరాలు సేకరించామన్నారు. మృతుడి భార్య జలగల్ల నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భారీగా ఇసుక డంప్ సీజ్


ఇసుకను సీజ్ చేస్తున్న అధికారులు

తూప్రాన్: పట్టణంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను రెవెన్యూ, పోలీసు అధికారులు గురువారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ విజయలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని భారత్ పెట్రోల్ బంక్ వెనుకాల అక్రమంగా సుమారు 12 ట్రాక్టర్ల ఇసుక నిల్వ చేసి ఉందన్న పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఎస్ఐ శివానందం, ఆర్ఐ నాగరాజు, సిబ్బందితో కలిసి ఇసుక డంప్‌ను పరిశీలించి సీజ్ చేశామన్నారు. ఇసుక డంప్ గూడూరు కరుణాకర్‌గౌడ్, భక్తుల యాదగౌడ్‌లది చెందినగా గుర్తించామన్నారు. చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చిరుత కలకలం


దూడపై గాయాలను చూపుతున్న మహిళ

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో చిరుత సంచరిస్తున్నట్లు గ్రామానికి చెందిన ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం అర్ధరాత్రి గ్రామ శివారులోని ఓ పశువుల కొట్టం వద్ద చిరుత దూడపై దాడి చేయడం, అటు వైపుగా వెళ్తున్న వాహనదారులు అది గమనించి హారన్ కొట్టడంతో చిరుత పారిపోయినట్లు తెలిపారు. ఉదయం సదరు లేక దూడ యజమాని వెంకటేశం గమనించగా లేక దూడ మెడపై చిరుత దాడికి సంబంధించి గాయాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ విషయమే గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించామన్నారు. చిరుత సంచారం పై అటవీ శాఖ అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి నిర్ధారణకు రాలేదు. గ్రామానికి అటవీ ప్రాంతం దగ్గరగా ఉండడం, గతంలోనూ ఇక్కడ చిరుత సంచారం ఉందని వాస్తవమని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ విషయంలో అటవీ శాఖ అధికారులు స్పందించి చిరుత బారి నుంచి రక్షణ కల్పించాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

సంగారెడ్డి టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఆరుగురికి కోర్టు జరిమానా విధించినట్లు సంగారెడ్డి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ సుమన్ కుమార్ మాట్లాడుతూ.. డ్రంకెన్ డ్రైవ్‌లో ఆరుగురిని పట్టుకున్నామన్నారు. పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా, జడ్జి నలుగురికి ఒక్కొక్కరికి రూ. 10 వేలు, ఇద్దరికి ఐదు రోజులపాటు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

టాస్క్‌లు, కమీషన్ల పేరుతో దగా

- సైబర్ వలలో ఉద్యోగులు
- ప్రభుత్వ ఉద్యోగి రూ.59 లక్షలు
- ప్రైవేట్ ఉద్యోగులు రూ.18 లక్షలు, 3.50 లక్షలు పోగొట్టుకున్న వైనం
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు



పటాన్‌చెరు టౌన్: ఉద్యోగులంతా ఆర్థిక ఇబ్బందులు తాళలేక ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల బలహీనతను ఆసరాగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు వారికి వల వేస్తున్నారు. వీరి వలలో పడిన ఉద్యోగులు వారు చెప్పిన విధంగా చేసి లక్షల్లో పోగొట్టుకుంటున్నారు. అనంతరం పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగి సైతం..

పార్ట్ టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్‌కు స్పందించి ఓ ప్రభుత్వ ఉద్యోగి రూ.59 లక్షలు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని నందన్ విడోస్‌కు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగికి పార్ట్‌టైం జాబ్ అంటూ టెలీగ్రామ్‌కు జనవరి 24వ తేదీన మెసేజ్ వచ్చింది. ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు అతడికి ఒక వ్యాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. ఉద్యోగి ముందుగా రూ.3 వేలు చెల్లించి ఇచ్చిన టాస్క్‌లు చేశాడు. తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్ల వ్యాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ. 59 లక్షలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ, తనకు ఇచ్చిన వ్యాలెట్ లో రూ.79 లక్షలు చూపిస్తూ వచ్చారు. ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గురువారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో ప్రైవేట్ ఉద్యోగి..

అమీన్‌పూర్ మండల పరిధిలోని బీరంగూడ మల్లారెడ్డి కాలనీకి చెందిన ప్రైవేటు ఉద్యోగికి పార్ట్ టైం జాబ్ పేరిట ఫిబ్రవరి 2వ తేదీన మెసేజ్ వచ్చింది. ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. అపరిచిత వ్యక్తి తనకు వ్యాలెట్ ఐడీని క్రియేట్ చేసి ఇచ్చి, టాస్క్‌లు పూర్తి చేస్తే కమీషన్ ఇస్తామని నమ్మించాడు. ఈ క్రమంలో బాధితుడు పలు దఫాలుగా రూ.18 లక్షలా 25 వేలు చెల్లించాడు. పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడుగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సాయి కాలనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి..

అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ సాయి కాలనీ కి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి జనవరి 15వ తేదీన పార్ట్‌టైం జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్ వచ్చింది. ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేయగా, అపరిచిత వ్యక్తి వ్యాలెట్ ఐడీని క్రియేట్ చేసి ఇచ్చాడు. టాస్క్‌లు పూర్తి చేస్తే, పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇస్తామని ఆశ చూపారు. దీంతో ఉద్యోగి పలు దఫాలుగా రూ. లక్షా 94 వేలు పెట్టాడు. ఇచ్చిన వ్యాలెట్‌లో రూ.3.50 లక్షలు చూపించారు. ఉద్యోగి తాను పెట్టిన నగతోపాటు కమీషన్ ఇవ్వాలని అడుగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గురువారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టాలి'

సంగారెడ్డి టౌన్: రియాక్టర్ పేలిన ప్రమాదంలో మృతి చెందిన శ్యాంబాబు కుటుంబానికి పరిశ్రమ యాజమాన్యం రూ.50 లక్షల చెల్లించాలని సీపీఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లాలోని పటాన్ చెరువు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలో మంగళవారం రాత్రి సీఎం హెచ్ పరిశ్రమలో రియాక్టర్ పేలి కార్మికుడు మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై గురువారం సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం ఏవో పరమేశ్వర్‌కి వినతిపత్రం అందజేశారు. అనంతరం జయరాజు మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లాలో వరుస ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ డిపార్ట్ మెంట్ అధికారులు కూడా ఎక్కడా సరిగ్గా తనిఖీలు చేయడం లేదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, రాజయ్య, సాయిలు, జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి, నర్సింహులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

టెట్ నిబంధనలు నిషేధించాలి

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం

వెల్దుర్తి(తూప్రాన్): నూతన విద్యా విధానం ప్రకారం విధించిన టెట్ నిబంధనలు, 2010 సంవత్సరం కన్నా ముందు నియామకమైన సీనియర్ ఉపాధ్యాయుల ప్రమోషన్‌లకు అడ్డుగా మారాయని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం అన్నారు. వివిధ డీఎస్సీల ద్వారా నియామకమై, దశాబ్దాల అనుభవంతో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతున్న ఉపాధ్యాయులకు టెట్ నిబంధనను చూపిస్తూ ప్రమోషన్‌లకు దూరం చేయడం దారుణమన్నారు. టెట్ నిబంధనలు బేషరతుగా నిషేధించి, తక్షణమే ప్రమోషన్‌లకు అనుమతించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

శభాష్ సిద్దేశ్వర్..!

- రాత్రిపూట విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయుడు
- పరీక్షల వరకు టీవీలు బంద్ పెట్టాలని తల్లిదండ్రులకు సూచన
- ఎలా సన్నద్ధం కావాలో సలహాలు


కన్‌సాన్‌పల్లి గ్రామంలో విద్యార్థికి సూచనలు చేస్తున్న సిద్దేశ్వర్

జోగిపేట(అందోల్): పది పరీక్షల వరకు టీవీలు బంద్ పెట్టాలని.. మీ పిల్లలు ఫెయిల్ అయితే బాధ్యత మీదేనంటూ ఉపాధ్యాయుడు సిద్దేశ్వర్ విద్యార్థుల ఇంటింటికీ తిరుగుతూ తల్లిదండ్రులకు సూచనలు చేస్తున్నారు. అందోలు మండలం కన్‌సాన్‌పల్లి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సిద్దేశ్వర్ రెండు రోజులుగా రాత్రి సమయంలో విద్యార్థుల ఇళ్లకు వెళ్తున్నారు. గురువారం రాత్రి విద్యార్థుల కూడా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి విద్యార్థులు పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారో తెలుసుకొని తనదైన శైలిలో చైతన్య పరిచారు. మార్చి 18 నుంచి ప్రారంభమయ్యే పరీక్షల కోసం విద్యార్థులు ప్రతి రోజూ పాఠశాల నుంచి వచ్చిన తర్వాత నిద్రపోయే సమయానికి గంట ముందు పాఠశాలలో చెప్పిన పాఠాలను మరోసారి చదువుకోవాలన్నారు. ఉదయం 5.30 గంటలకు లేచి చదువుకునేలా విద్యార్థుల తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని సూచిస్తున్నారు. ప్రతి రోజూ 30 మంది ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో చర్చిస్తున్నారు. గతంలో తాను చేసిన ఈ ప్రయత్నం వల్ల మంచి ఫలితాలు వచ్చాయని సిద్దేశ్వర్ తెలిపారు. ఉపాధ్యాయుడు విద్యార్థుల కోసం పడుతున్న తపనకు తల్లిదండ్రులు అభినందిస్తున్నారు.

గౌరవెల్లి నీళ్ల కోసం అసెంబ్లీలో చర్చించా

- బీఆర్ఎస్ నాయకులు ఎదురుదాడి చేస్తున్నారు
- గిరిజనులు ఆర్థికంగా ఎదగాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్


మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: గౌరవెల్లి నీళ్ల కోసం పోరాడాలని ఈ ప్రాంత ప్రజలు కొట్లాడమంటున్నారని, శాసన సభా వేదికగా నీళ్లకోసం చర్చిస్తే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎదురుదాడి చేస్తున్నారని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీఆర్ఎస్ నాయకులు భయపెడితే భయపడేది లేదని, వాళ్లకు నేను పాలేరు కాదన్నారు. శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల సందర్భంగా గురువారం హుస్నాబాద్ పట్టణంలోని గిరిజన భవన్‌లోనిర్వహించిన బోగ్ బండార్ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని పూజలు చేశారు. గిరిజన మహిళలతో కలిసి నృత్యాలు చేశారు. అంతకు ముందు గిరిజన మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. గిరిజనులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. నాటి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన రిజర్వేషన్లు నేడు గిరిజన కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయని అన్నారు. ఎస్టీ కాంపోండ్ కింద గిరిజన తండాల రోడ్లు, తాగునీరు వంటి అభివృద్ధి కోసం నిధులు వెచ్చించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ బెన్ షాలెమ్, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, ఎంపీపీలు లకావత్ మానస, మాలోతు లక్ష్మీ, జెడ్పీటీసీ భూక్య మంగ, కౌన్సిలర్ భూక్య సరోజన, ప్రొఫెసర్ వీరన్న నాయక్, గిరిజన సంఘాల నాయకులు తిరుపతి నాయక్, రమేష్ నాయక్, లావుడ్యా వీరన్న నాయక్, రూప్‌సింగ్ రాంబాబు నాయక్, బిఖ్యా నాయక్, రాజు నాయక్, శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


హుస్నాబాద్ పట్టణంలో గిరిజన మహిళల ర్యాలీ

కబ్జా భూమిని గ్రామస్తులే స్వాధీనం


ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన గ్రామస్తులు

రెవెన్యూ అధికారుల ఆలస్యంతో ఫ్లెక్సీని ఏర్పాటు

కొండపాక(గజ్వేల్): కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని గ్రామస్తులే అడ్డుకొని ఫ్లెక్సీతో కూడిన బోర్డును ఏర్పాటు చేశారు. ఈ ఘటన కొండపాక మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివారులోని సర్వే నంబరు పలు సర్వే నంబర్లలో సుమారు 130 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గతంలో సుమారు 30 ఎకరాల వరకు కబ్జాకు గురవ్వగా ఇటీవల మరో 10 ఎకరాల భూమిని సిద్దిపేటకు చెందిన కొందరు వ్యక్తులు కబ్జా చేసుకునేందుకు పనులు చేపట్టారు. ఇదే భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ అవసరాలు, ధాన్యం కొనుగోలు కేంద్రం, డంప్‌యార్డు తదితర అభివృద్ధి పనుల కోసం ఉపయోగించుకునేలా చూడాలని అందుకోసం హద్దులు ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలిచ్చింది. కానీ అధికారులు నిర్లక్ష్యం చేయడంతో గ్రామస్తులు ఆర్డీఓను ఆశ్రయించారు. ఆర్డీఓ బన్సీలాల్ సూచనల మేరకు గురువారం గ్రామానికి వస్తున్నట్లుగా రెవెన్యూ అధికారులు చెప్పి రాలేదు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు కబ్జాకు గురవుతున్న భూమిని స్వాధీనం చేసుకొని ఫ్లెక్సీతో కూడిన నోటీస్ బోర్డును ఏర్పాటు చేసినట్లు ఎంపీటీసీ యాదగిరితోపాటు గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఫోన్ చేయగా స్పందించలేదు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యాచకురాలు మృతి


దుర్గమ్మ (ఫైల్)

నర్సాపూర్ రూరల్: ఆర్టీసీ బస్సు ఢీకొని యాచకురాలు మృతి చెందిన ఘటన గురువారం నర్సాపూర్ – మెదక్ రహదారిలోని ఓ రెస్టారెంట్ సమీపంలో చోటు చేసుకుంది. నర్సాపూర్ ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ సునీతా రెడ్డి కాలనీకి చెందిన యాచకురాలు సంకు దుర్గమ్మ (45) రోడ్డు దాటుతుండగా మెదక్ నుంచి నర్సాపూర్ వైపు వస్తున్న మెదక్ డిపో ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన దుర్గమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. దుర్గమ్మ కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హైడ్రాలిక్ రాడ్ పడి వలస కూలీ మృతి

సిద్దిపేటరూరల్: హైడ్రాలిక్ రాడ్ మీద పడి వలస కూలీ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఇర్కోడ్ గ్రామం వద్ద చోటు చేసుకుంది. మృతుడి బావమరిది ఠాకూర్ అనిక్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన తనతోపాటు శీర్మభీమ్‌శీర్మ (40), మరి కొంత మంది కూలీలు వలస వచ్చి, 10 ఏళ్లుగా ఎస్ఎల్ఎంఐ ఇన్‌ఫ్రా కంపెనీలో డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఏడాదిగా సిద్దిపేట–మెదక్ వరకు నిర్మిస్తున్న హైవే రోడ్డు పనుల్లో భాగంగా ఇర్కోడ్ వద్ద ఉన్న కంపెనీ సైట్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం సైట్‌లో కంకర ఖాళీ చేస్తున్న సయమంలో టిప్పర్ బోల్తా పడింది. సైట్ సూపర్‌వైజర్, సైట్ మెకానిక్ ఇన్‌చార్జిలు హైడ్రాలిక్‌తో టిప్పర్‌ను పైకి లేపుతుండగా తాడు తెగి ప్రమాదవశాత్తు శీర్మభీమ్‌శీర్మపై పడింది. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని సూపర్ వైజర్ కొత్తపల్లి గంగాధర్ తనకు చెప్పినట్లు పేర్కొన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి బావమరిది పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అపూర్వరెడ్డి తెలిపారు.

మన ఊరు– మన చరిత్రపై జాతీయ సదస్సు

కన్వీనర్ డాక్టర్ కొలిపాక శ్రీనివాస్




సిద్దిపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానామస్ కళాశాలలో నేటి నుంచి రెండు రోజులపాటు 'మన ఊరు–మన చరిత్ర' అనే అంశంపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల చరిత్ర విభాగాధిపతి, సదస్సు కన్వీనర్ డాక్టర్ కొలిపాక శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. సదస్సుకు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర పాండిచ్చేరి, కర్ణాటక రాష్ట్రాల నుంచి చరిత్రకారులు, అధ్యాపకులు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రతీ గ్రామానికి పట్టణానికి ఒక చరిత్ర ఉంటుందని దానిని ఎలా రాయాలనే విధివిధానాలను సదస్సులో వక్తలు వివరిస్తారని చెప్పారు. తొలిరోజు ఏడు సెషన్ల పాటు జరిగే కార్యక్రమంలో విద్యార్థులు తమ గ్రామాల చరిత్రను పోస్టర్ ప్రజెంటేషన్ రూపంలో వివరిస్తారన్నారు. ముఖ్యఅతిథిగా ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ముఖ్యవక్తులుగా ఉస్మానియా యూనివర్సిటీ డీన్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ప్రొఫెసర్ కూతడి అర్జున్ రావు, కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ రామోజీ హరగోపాల్, డాక్టర్ సంఘనపట్ల నరసయ్య, తెలుగు యూనివర్సిటీ ఆచార్యులు డాక్టర్ వెంకన్న, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్లు ఎస్. కనకరత్నం, విజయబాబు, చంద్రమౌళి, డాక్టర్ డీటీ చారి తదితరులు హాజరవుతారన్నారు.

అక్రమ కలప పట్టివేత

పాపన్న పేట (మెదక్): అక్రమంగా కలపను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు పాపన్నపేట డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. గురువారం రాత్రి పాపన్నపేట గ్రామ శివారులోని ఓ వ్యవసాయ భూమిలో నుంచి అక్రమంగా కలపను తరలిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి సుమారు 5 నుంచి 6 టన్నుల బరువున్న వేప, సుబాబుల్, పాల పాడిష చెట్లకు సంబంధించిన కలపను పట్టుకొని సీజ్ చేసి ట్రాక్టర్ యజమాని చంద్రయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పొలంలోనే ప్రాణాలు వదిలిన రైతులు


రాంరెడ్డి (ఫైల్)

దౌల్తాబాద్(దుబ్బాక): మట్టిని నమ్ముకున్న రైతు మట్టిలోనే తనువు చాలించాడు. రోజు మాదిరిగానే పొలం తిరుగుతుండగా ఒరం గట్టుపై కాలుజారి ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని గాజులపల్లి గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండలం గాజులపల్లి గ్రామానికి చెందిన పాతుగంటి రాంరెడ్డి (45) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రాంరెడ్డి రోజు మాదిరిగానే బుధవారం పొద్దునే పొలం దగ్గరికి వెళ్లాడు. కూలీ పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చిన భార్య సునీతకు రాంరెడ్డి కనిపించలేదు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో గ్రామస్తులతో కలిసి ఆచూకీ కోసం వెతుకుతుండగా పొలంలో పడి మృతి చెంది కనిపించాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మూర్ఛవచ్చి.. పొలంలో పడి..

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రమాదవశాత్తు పొలంలో పడి యువ రైతు మృతి చెందిన ఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతెలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బైండ్ల శ్రీకాంత్ (36) వ్యవసాయంతోపాటు, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లి రాత్రి అయినా తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఈ క్రమంలో చుట్టుపక్కల, పొలం వద్ద వెతుకుతుండగా శ్రీకాంత్ బోర్లా పడి మృతి చెంది ఉన్నాడు. చాలా రోజులుగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న శ్రీకాంత్ పొలంలో పడ్డ సమయంలో మూర్ఛ వచ్చి ఊపిరాడక మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భూంపల్లి ఎస్ఐ భువనేశ్వర్‌రావు తెలిపారు.


పొలంలో శ్రీకాంత్ మృతదేహం

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం సదాశివపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. మునిపల్లి మండలంలోని చిన్న చెల్మెడ గ్రామానికి చెందిన గడ్డమీది శివయ్య(45) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరగడంతో 14వ తేదీన ఉదయం సదాశివపేట మండలంలోని నిజాంపూర్ గ్రామంలోని కూతురు ఇంటికి వచ్చాడు. తిరిగి అదే రోజు సాయంత్రం ఇంటికి వెళ్తున్నానని కూతురితో చెప్పి వెళ్లాడు. అలా వెళ్లిన శివయ్య స్వగ్రామానికి వెళ్లకుండా నిజాంపూర్ గ్రామ శివారులో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మనస్తాపంతో యువకుడు

కోహీర్(జహీరాబాద్): ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పైడిగుమ్మల్ గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై క్రిష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంజీవులు (25) ఆటో నడుపుకొని జీవిస్తున్నాడు. మూడు రోజుల కిందట సంజీవులుకు భార్య అరుణకు గొడవ జరుగడంతో కూతురిని తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. ఇంట్లో సంజీవులు, తండ్రి విజేందర్ మాత్రమే ఉండగా బుధవారం రాత్రి ఇద్దరూ భోజనానికి కూర్చున్నారు. ఇప్పుడే వస్తానని బయటికి వెళ్లిన కొడుకు ఎంతకూ రాకపోవడంతో గంట తర్వాత బయటికి వెళ్లి చూడగా సంజీవులు ఉరి వేసుకొని కనిపించాడు. గ్రామానికే చెందిన ఓ వ్యక్తితో చనువుగా ఉండడాన్ని గమనించిన సంజీవులు భార్య అరుణపై అనుమానాన్ని పెంచుకొని గొడవపడ్డాడు. ఆమె పుట్టింటికి వెళ్లడంతో సమాజంలో తనకు చెడ్డ పేరు వస్తుందని భావించి తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని తండ్రి విజేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై క్రిష్ణయ్య తెలిపారు.


సంజీవులు(ఫైల్)